# పౌరహక్కుల సంఘంపైన దాడులను తిప్పికొట్టండి !

ప్రజలారా !

పౌరహక్కుల సంఘాన్ని తిట్టడం రాష్ట్రంలో ఇప్పుడొక ఫ్యాషన్ అయిపోయింది.

ఈ ఫ్యాషన్ మొదలు పెట్టిన వాడు స్వయాన రాష్ట్ర హోం మంత్రి మాధవరెడ్డి.

నక్సలైట్లు ఎవరినైనా చంపితే హోం మంత్రి నక్సలైట్లను తిట్టడు. పౌరహక్కుల సంఘాన్ని తిడతాడు. విషయం తెలియని వాళ్లు పౌరహక్కుల సంఘమే ఆ హత్య చేసిందనుకోవాలి.

నక్సలైట్లు పోలీసులను చంపితే పోలీస్ ఆఫీసర్ల సంఘం నక్సలైట్ల గురించి తీర్మానమేదీ చేయదు. 'పౌరహక్కుల సంఘాన్ని నిషేధించాలి' అని తీర్మానం చేస్తుంది. పౌరహక్కుల సంఘాన్ని నిషేధిస్తే నక్సలైట్లు పోలీసులను చంపడం మానేస్తారా ఏమిటని జనం అర్థంకాక ఆశ్చర్యపోవాలి.

చిలకలూరిపేట బస్సు దహనం కేసు ముద్దాయిల ఉరిశిక్షలు రద్దు చేయాలని ఆందోళన చేస్తే, 'ముందు ఈ పౌరహక్కుల నాయకులను ఉరి తీయాలి' అని ఆవేశపడతారు. పౌరహక్కుల వాళ్లు వెనక ఉండి హత్యలు చేయించి హంతకులకు శిక్షపడకూడదని ఆందోళన చేసే దుర్మార్గులేమోనని తెలియనివాళ్లు అనుకోవాలి.

'నా అనుమతి లేకుండ పౌరహక్కుల సంఘం వాళ్లు నా జిల్లాలోకి రాకూడదు' అని మెదక్ జిల్లా ఎస్.పి. వినయ్‌కుమార్‌సింగ్ అంటాడు. ఎందుకని అడిగితే, 'వాళ్ళు నా జిల్లాలో ఎప్పుడు అడుగు పెట్టినా హత్యలు జరుగుతున్నాయి కాబట్టి' అంటాడు. పౌరహక్కుల వాళ్లు 'సంఘ విద్రోహులు, దేశద్రోహులు' అని అంటాడు. నిజామాబాద్ ఎస్.పి. సి.వి. ఆనంద్, భువనగిరి డి.ఎస్.పి. రవీంద్రరెడ్డి, ఇతర కిందిస్థాయి పోలీస్ అధికారులు అవే మాటలు అంటారు. 'వరంగల్‌లో ఏ విషయం మీదనయినా సరే పౌరహక్కుల సంఘం సభ జరగడానికి వీలు లేదు' అని వరంగల్ ఎస్.పి. వెంకటేశ్వరరావు అంటాడు. అది పోలీస్ అత్యాచారాల గురించి సభ కానవసరం లేదు. (దానినయినా పోలీసులు నిషేధించవచ్చునని కాదు). ఉరిశిక్షలు గురించి కావచ్చు, ప్రాంతీయ అసమానతల గురించి కావచ్చు, ఇంకేదయినా కావచ్చు.

పోలీసులకు జాగీర్దారీ హక్కులు ఎప్పుడు ఇచ్చారా అని వినేవాళ్లు ఆశ్చర్యపోవాలి. రాజ్య బహిష్కరణ, పాస్‌పోర్ట్ నిరాకరణ మొదలయిన సార్వభౌమ అధికారాలు ఐపిఎస్ పట్టభద్రులకు మనం కునుకు తీస్తుండగా పార్లమెంటు ఇచ్చేసిందేమో ననుకోవాలి. పౌరహక్కుల సంఘం వాళ్లు బాంబులూ తుపాకులూ పట్టుకొని హత్యలకూ దొమ్మీలకూ పాల్పడే రౌడీ బాపతు అనుకోవాలి. వీళ్లు ఊరూరా తిరుగుతూ హత్యలు చేయిస్తుంటారనీ, అల్లర్లు రెచ్చగొడుతుంటారనీ అనుకోవాలి.

నిజానికి పౌరహక్కుల సంఘం ఈ పనులేవీ చేయదని అందరికీ తెలుసును. పౌరహక్కుల సంఘం చేసే పని చైతన్యాన్ని పెంపొందించే ప్రచారం చేయడం, శాంతియుతంగా ఆందోళన

చేయడం, కోర్టులలో కేసులు వేయడం. అయినప్పటికీ పౌరహక్కుల సంఘం మీద వీళ్ళందరికీ ఇంత ద్వేషం ఉందంటే మేము చెప్పే మాటలు వాళ్లకు ఎక్కడో తగులుతున్నాయని అనుకోవాలి. విమర్శల ముల్లు ఎక్కడో గుచ్చుకుంటూ ఉందని అనుకోవాలి. ఈ నోరు మూసేయడం వాళ్ల ప్రయోజనాలకు అవసరం అని భావిస్తున్నారనుకోవాలి.

ఎవరి నోరయినా ఎందుకు మూసేయాలి ? ఇబ్బందికరమైన నిజాలు మాట్లాడితే మూసేయాలి.

నక్సలైట్లు హింసకు పాల్పడుతున్నారు కాబట్టి వాళ్లను ఎదుర్కునే పేరుమీద పోలీసులు ఏం చేసినా చెల్లుతుందని పోలీసుల వాదన. బూటకపు ఎన్‌కౌంటర్లు, చిత్రహింసలు, ఇళ్ల కూల్చివేత, మనుషుల అపహరణ - అన్నీ చెల్లుతాయి. నక్సలైట్లు భారత రాజ్యాంగానికి లోబడి ఉండరు కాబట్టి ఆ రాజ్యాంగంలోని హక్కులు వారికి వర్తించవని మరొక వాదన.

ఇవేవీ చెల్లవని పౌరహక్కుల సంఘం అంటుంది. చట్టవిరుద్ధమైన చర్యలను కూడ చట్టబద్ధంగానే నియంత్రించాలి, చట్టం పరిధిలోనే ఎదుర్కొనాలి. అప్పుడే అది ప్రజాస్వామ్య పాలన అనిపించుకుంటుంది. రాజ్యాంగానికి లోబడి ఉండని వారి హక్కులను కూడ రాజ్యాంగం గుర్తిస్తుంది. గుర్తించి తీరాలి. ఎందుకంటే ఆ హక్కులు ఎవరి సొత్తూ కాదు. అవి నాగరికతా ప్రమాణాలు. మానవ జాతి చారిత్రక విజయాలు.

ఇవన్నీ ఇబ్బందికరమైన నిజాలు. వీటిని ఒప్పుకోకుండానే భారతదేశాన్ని ఒక ప్రజాస్వామ్య దేశంగా చలామణి చేద్దామనుకునేవారికి ఇవి సహించరాని వాస్తవాలు. ఈ వాస్తవాలు మాట్లాడే నోటిని మూసేయకపోతే 'ఎన్‌కౌంటర్ల'ను ప్రజాస్వామ్య పాలనగా చలామణి చేసే ఈ ప్రహసనం సాగదు. మీరు హింస ఎందుకు చేస్తున్నారని పోలీస్ అధికార్లను ప్రశ్నిస్తే, నక్సలైట్లు ఎంత హింస చేస్తున్నారో పట్టికలతో సహా ఏకరువు పెట్టి 'ఆ ప్రశ్నకు ఇదే సమాధానం పొమ్మ'నే వాదనాసరళి సాగదు.

నక్సలైట్ల చర్యలు వట్టి హింసోన్మాదమేననీ వాటికి ఒక రాజకీయ లక్ష్యంగానీ సామాజిక ఆర్థిక భూమికగానీ లేవని హోం మంత్రి మాధవరెడ్డి అంటాడు. ఇది ఆయన వ్యక్తిగత అభిప్రాయం కాదు. రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయం. పోలీసు మేధావి అరవిందరావు ఒక్కడుగు ముందుకు పోయి నక్సలైట్ ఉద్యమానికి సామాజిక ఆర్థిక పునాది ఉందనడం వారి హింసను పరోక్షంగా సమర్థించడమేనని బెదిరిస్తాడు.

ఎవ్వరి హింసనూ ప్రత్యక్షంగాగానీ పరోక్షంగాగానీ సమర్థించడం పౌరహక్కుల సంఘం ఉద్దేశ్యం కాదు. అయితే హింసకు ఉండే సామాజిక స్వభావాన్ని అర్థం చేసుకోవాలని పౌరహక్కుల సంఘం అంటుంది. నక్సలైట్ల హింస పేద, పీడిత ప్రజల సమస్యలతోనూ, అవసరాలతోనూ ముడిపడి ఉందని అర్థం చేసుకొని తదనుగుణమైన సాంఘిక ఆర్థిక సంస్కరణల ద్వారా దానిని ఎదుర్కొనాలని పౌరహక్కుల సంఘం అంటుంది. ఇది హింసను సమర్థించడం కాదు. హింసను అర్థం చేసుకొని దానితో ప్రజాస్వామికంగా, నాగరికంగా వ్యవహరించాలనడం.

ఇవి ఇబ్బందికరమైన అభిప్రాయాలు. వీటిని ఒప్పుకుంటే పోలీసు నిర్బంధమే ఏకైక జవాబుగా ఉన్న ప్రభుత్వ విధానం చెల్లదు. సాంఘిక ఆర్థిక సంస్కరణలు జరగాలంటే ఇప్పటిదాకా జరగలేదని ఒప్పుకోవాలి. కనీసం జరగవలసినంత జరగలేదని ఒప్పుకోవాలి. అంతా జరిగిపోయిందనే వైఖరి విడిచిపెట్టాలి. చంద్రబాబు నాయుడు, మాధవరెడ్డి అలా విడిచిపెట్టగలరా ? ఛఛ ! ఈ మాటలు మాట్లాడే పౌరహక్కుల సంఘాలను నిషేధించాల్సిందే.

సంస్కరణలు ప్రధానమంటే ఇప్పటిదాకా అణచివేత కోసం పోలీసులకు ఇచ్చిన విపరీత అధికారాలు వెనక్కి తీసుకోవాలి. పోలీసులు తెలంగాణా జిల్లాల్లో నిర్వహిస్తున్న రాజకీయ పాత్ర వదిలిపెట్టి తిరిగి పోలీసు పనులకు వెళ్లాలి. ఇది అరవిందరావు వంటి పోలీస్ అధికారులకు ఎంతమాత్రం ఇష్టం లేదు. నిర్హేతుకమైన అణచివేత విధానాల వల్ల తమకు చేజిక్కిన అధికారమంతా వదులుకోవడమా ? తిరిగి ఎర్రటోపీ పెట్టుకుని పోలీస్ పని చేయడమా ! ఛఛ ! ఈ పౌరహక్కుల సంఘాన్ని నిషేధించాల్సిందే.

ఇరవై ముగ్గురి ప్రాణాలు తీసిన చిలకలూరి పేట ఘటనలో బాధ్యత మొత్తం ఆ యిద్దరు యువకులదే కాదనీ, సామాజిక వ్యవస్థ ఎంతో కొంత బాధ్యత స్వీకరించాలనీ పౌరహక్కుల సంఘం అనడం ఇబ్బందికరమైన అభిప్రాయమే. అప్పుడు పేదరికానికీ మురికివాడలలో బ్రతికే దళితుల జీవితాలకూ మనమంతా కొంత బాధ్యత వహించవలసి ఉంటుంది. చిలకలూరిపేట కేసును కారంచేడు కేసుతో పోల్చి మాట్లాడితే న్యాయవ్యవస్థ కులవివక్షకు అతీతం కాదేమోనన్న సందేహాన్ని గుర్తించవలసి వస్తుంది. నేరం గురించి, శిక్ష గురించి మనం చేసే ఆలోచనలపైన కులం ప్రభావం ఉందని ఒప్పుకోవలసి వస్తుంది. ఇది చాలా ఇబ్బంది పెట్టే ఆలోచన. దొంగ వెధవలందరినీ జైళ్లలో కుక్కి హంతకులనందరినీ ఉరికంబం ఎక్కించి మనం హాయిగా ప్రశాంతంగా ఉందామంటే వీళ్లు ఉండనీయరు - ఛఛ ! ఈ పౌరహక్కుల వాళ్లను ముందు ఉరితీయాలి.

**తప్పుడు కేసులు, దాడులు**

తెలంగాణాలో పోలీసులు పౌరహక్కుల సంఘాన్ని శాపనార్థాలు పెట్టడంతో సంతృప్తి చెందడం లేదు. బెదిరించడం, కేసులలో ఇరికించడం, దుష్ప్రచారం చేసి అప్రతిష్ఠపాలు చేయడం, ఆర్థికంగా దెబ్బ తీయడం మొదలయిన దుర్మార్గమైన ఎత్తుగడలు అవలంబిస్తున్నారు. నక్సలైట్లు పోలీసులను ఎప్పుడు చంపినా మృతదేహాల ఊరేగింపులో పౌరహక్కుల బాధ్యులను పేరు పేరునా పేర్కొంటూ చంపుతాం నరుకుతాం అని నినాదాలు ఇస్తున్నారు. ఎస్.పి, డి.ఐ.జి. స్థాయి అధికారులు పక్కన ఉండి ఈ నినాదాలు ఇప్పిస్తున్నారు.

వరంగల్ పోలీసులు పౌరహక్కుల సంఘం కార్యకర్తలను అప్రతిష్ఠ పాలుచేయడానికి 'వరంగల్ ప్రజల' పేరిట కరపత్రాలు ముద్రించి పంచుతున్నారు. పౌరహక్కుల వాళ్లు నక్సలైట్ల 'ఉంపుడుకత్తెలు' అనీ 'తొత్తులు' అనీ పోలీస్ సంస్కృతికి తగిన భాషనూ భావాలనూ ఈ కరపత్రాలలో వ్యక్తం చేస్తున్నారు. ఏదో వ్యక్తిగత స్వార్థం కోసం పౌరహక్కుల సంఘంలో చేరుతున్నారనీ పౌర హక్కుల సంఘంలో చేరి వ్యక్తిగత ప్రయోజనాలు పొందుతున్నారనీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇది భౌతిక దాడులకు నాంది. ముందు అప్రతిష్ఠ పాలుచేసి స్వార్థపరులు, దుర్బుద్ధిపరులు అనే

అభిప్రాయం ప్రజలలో కలిగించేస్తే ఆ తరువాత భౌతిక దాడులకు పాల్పడితే సానుభూతి చూపించే వారుండరనేది వరంగల్ పోలీసుల ఆలోచన. ఈ నీచమైన దుష్ప్రచారంలో పౌరహక్కుల సంఘం వరంగల్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్‌ను, సహాయ కార్యదర్శి గుంటి రవినీ పోలీసులు పేరుపెట్టి దురుద్దేశ్యాలు అంటగట్టి దూషిస్తున్నారు.

అంబటి శ్రీనివాస్‌పైన పోలీసులు వేరే రకమైన దాడికూడ మొదలు పెట్టారు. అతని న్యాయవాద వృత్తిని నాశనం చేయాలన్న ప్రయత్నం చాలా విజయవంతంగా చేస్తున్నారు. అతని దగ్గరకు వెళ్లే క్లైంట్లను బెదిరిస్తున్నారు. కేసు వేరొక లాయరుకు ఇమ్మనీ లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయనీ హెచ్చరిస్తున్నారు. పోలీసు కస్టడీ నుండి కోర్టుకు పంపించే క్రిమినల్ కేసు ముద్దాయిలను 'శ్రీనివాస్ కాక వేరే లాయర్‌ను పెట్టుకో. శ్రీనివాస్‌ను పెట్టుకుంటే ఇంకొక పదికేసులు పెడతాం' అని బెదిరిస్తున్నారు. చిన్న వయసులోనే నర్సంపేట కోర్టులో అగ్రగామి న్యాయవాదిగా ఎదిగిన శ్రీనివాస్ వృత్తిని బలప్రయోగంతో బెదిరింపుతో నాశనం చేస్తున్నారు.

మెదక్, నల్గొండ జిల్లాలలో పోలీసులు పౌరహక్కుల సంఘం కార్యకర్తలపైన పబ్లిక్ సెక్యూరిటీ చట్టం క్రింద కేసులు పెట్టారు. నల్గొండలో ఫిబ్రవరి 22న గద్దర్‌తో పాటు పౌరహక్కుల సంఘం కార్యకర్తలను ఇరికించిన కేసు ప్రభుత్వమే ఎత్తివేసింది. కానీ మెదక్‌లో పౌరహక్కులసంఘం బాధ్యుడు బి. రాంరెడ్డి పైన పూర్తిగా కల్పితమైన అభియోగాలతో పెట్టిన తప్పుడు కేసు ఎత్తివేయలేదు.

ఇదంతా ఒకెత్తయితే చంపుతామన్న బెదిరింపులు, భౌతిక దాడులు వేరొక ఎత్తు. ప్రజా గాయకుడు గద్దర్ పైన "మేమే కాల్పులు జరిపాం" అని ప్రకటించిన గ్రీన్ టైగర్స్ ఆ తరువాత కొద్ది రోజులకు 'ఈసారి పౌరహక్కుల సంఘం నాయకులను చంపుతాం' అని బెదిరించారు. ఈ గ్రీన్ టైగర్స్ అనేది ఒక సంస్థ కాదు, ఒక వ్యక్తి కూడ కాదు. అది పోలీసుల బినామీ నామధేయం మాత్రమే. పోలీసులు చట్టవిరుద్ధంగా చంపగలరుగానీ 'రేపు చంపబోతాం' అని బహిరంగంగా ప్రకటించలేరు. కాబట్టి బెదిరింపులకూ హెచ్చరికలకూ ఈ బినామీ అవసరం అయింది. నిజానికి ఎన్‌కౌంటర్ మృతుల దేహాలను స్వాధీనం చేసుకునే ఉద్యమాన్ని గద్దర్ నడపడం వల్ల పోలీసులకు తప్ప వేరే ఎవ్వరికీ నష్టం లేదు. పోలీసులకు తప్ప వేరే ఎవ్వరికీ ఆయనపైన దాడి చేయవలసిన అవసరం లేదు. ఆ గ్రీన్ టైగర్స్ అనే వాళ్లు తమ హిట్ లిస్టులో ఉన్న తదుపరి పేర్లు పౌరహక్కుల సంఘం బాధ్యులవేనని ప్రకటించడంతో అవి పోలీసు పులులేనని స్పష్టం అవుతున్నది.

పౌరహక్కుల ఉద్యమానికి ఈ దాడులు కొత్త కాదు. గోపిరాజన్నను, డా॥ రామనాథంను, జాపా లక్ష్మారెడ్డిని, నర్రా ప్రభాకరరెడ్డిని పోగొట్టుకొని కూడ ఈ ఉద్యమం నిలబడింది, బలపడింది, ప్రజల మన్ననలు పొందింది. అయితే పౌరహక్కుల సంఘంపైన జరిగే దాడులు పౌరహక్కులపైన జరిగే దాడులనీ, ప్రజల హక్కులపైన జరిగే దాడులనీ గ్రహించి ఈ దాడులను తిప్పి కొట్టడంలో ప్రజలంతా మాకు అండగా నిలబడతారని ఆశిస్తాం, నిలబడాలని కోరుతున్నాం.

1 జూన్ 1997

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం**
**(APCLC)**